క్లుప్తంగా

స్కూలుకు స్థల పరిశీలన

పినపాక: ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రతి నియోజకవర్గంలో నిర్మించనున్న ఇంటిగ్రేటెడ్ స్కూలుకు సంబంధించి స్థలాలను పినపాక తహసీల్దార్ గోపాలకష్ణ బుధవారం పరిశీలించారు. గోపాలరావుపేట గ్రామంలో అనువుగా ఉన్న ఓ స్థలాన్ని పరిశీలించారు. గ్రామస్తులతో మాట్లాడి వారికున్న ఇబ్బందులను అడిగి తెలుసుకున్నారు. ఇంటిగ్రేటెడ్ స్కూల్లో విద్యార్థులకు భవిష్యత్తు ఉంటుందని, భూములు కోల్పోతున్న రైతులకు పాఠశాలలో ఏదైనా ఉపాధి కల్పించేందుకు కలెక్టర్ దృష్టికి తీసుకెళ్తామన్నారు. రెవెన్యూ సిబ్బంది, గ్రామస్తులు పాల్గొన్నారు.

అధిక ధరకు అమ్మితే చర్యలు

అశ్వాపురం: ప్రభుత్వం సూచించిన ధరల కన్నా అధిక రేటుకు ఇసుక అమ్మితే కఠిన చర్యలు తీసుకుంటామని తహసీల్దార్ మణిధర్ హెచ్చరించారు. మండల కేంద్రంలోని రైతువేదికలో బుధవారం మండలంలోని ట్రాక్టర్ల యజమానులతో ఇందిరమ్మ ఇళ్లకు ఇసుక సరఫరాపై సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ.. ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం కోసం ఆయా పంచాయతీ కార్యదర్శులు ఇసుక కూపన్లు మంజూరు చేస్తారని, కూపన్లు మంజూరైన ట్రాక్టర్లు మాత్రమే ఇసుక రవాణా చేయాలని సూచించారు. ఎంపీఓ ముత్యాలరావు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

పూలవర్తక సంఘం ఏర్పాటు

భద్రాచలంఅర్బన్: భద్రాచలం పట్టణంలో పూలు వ్యాపారం చేసుకుని జీవిస్తున్న వారందరూ కలిసి సీఐటీయూ అనుబంధంగా శ్రీ భద్రాద్రి పూలవర్తకం సంఘం పేరిట కమిటీని బుధవారం ఏర్పాటు చేసుకున్నారు. మొత్తం 13 మంది సభ్యులతో కూడిన నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. కాగా ఈ సంఘం గౌరవ అధ్యక్షుడిగా నర్సారెడ్డిని ఎన్నుకోగా.. అధ్యక్షుడిగా నాగేశ్వరరావు, కార్యదర్శిగా ఖలీల్, కోశాధికారిగా రమాదేవితో పాటు మరికొంత మంది సభ్యులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. సీఐటీయూ పట్టణ కన్వీనర్ బండారు శరత్, నాయకులు గడ్డం స్వామి పాల్గొన్నారు.

సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం

మణుగూరుటౌన్: భవన నిర్మాణ సమయంలో ప్రమాదవశాత్తు మరణించి కార్మికులకు ఇచ్చే ప్రమాదబీమాను రూ.10లక్షలకు పెంచుతూ ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాన్ని హర్షిస్తూ సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం నిర్వహించారు. బుధవారం పట్టణంలోని అంబేడ్కర్ చౌరస్తాలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో భవన నిర్మాణ కార్మిక సంఘం, ప్రైవేట్ ఎలక్ట్రీషియన్స్, టెక్నీషియన్ ట్రేడ్ యూనియన్ నాయకులు పాలాభిషేకం చేశారు. భవన నిర్మాణ కార్మికుల అధ్యక్షుడు తనుగుల శ్రీను, కార్యదర్శి మాధవ, పోలిరెడ్డి, తిరుపతి, ఎలక్ట్రీషియన్ నాయకులు సత్యనారాయణ పాల్గొన్నారు.

హెచ్ఐవీపై ప్రదర్శన

భద్రాచలంఅర్బన్: హెచ్ఐవీ వ్యాధిని నియంత్రణ చేయాలని ఉద్దేశంతో జిల్లా ఎయిడ్స్ అండ్ లెప్రసీ ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ పుల్లారెడ్డి సూచనల మేరకు పోలూరి రాము జానపద కళాజాతా బృందం సభ్యులు భద్రాచలం ఆర్టీసీ బస్ స్టాండ్‌లో బుధవారం హెచ్ఐవీ, ఎయిడ్స్‌పై అవగాహన కల్పించారు. పాటల ద్వారా హెచ్ఐవీ వైరస్ సోకడం వల్ల నష్టాలు, మందుల వాడకం, ఐసీటీసీ సేవలతో పాటు 1097 టోల్ ఫ్రీ గురించి వివరించారు. కళాకారులు పోలూరి రాము, కొచ్చర్ల గురవయ్య, రాంబాబు, నాగలక్ష్మి పాల్గొన్నారు.

నిరసనకు మద్దతు

భద్రాచలంఅర్బన్: భద్రాచలం ఆర్టీసీ డిపోలోని టిమ్ డ్రైవర్లు మూడు రోజులుగా విధులు బహిష్కరించి నిరసన చేస్తుండగా.. బుధవారం వారికి సీపీఐ ప్రతినిధి బృందం సంఘీభావం ప్రకటించింది. ఈ సందర్భంగా సీపీఐ రాష్ట్రసమితి సభ్యుడు రావులపల్లి రవికుమార్ మాట్లాడుతూ.. ఆర్టీసీ కార్మికుల సమస్యలు పరిష్కారమయ్యేంత వరకు తమ పోరాటం కొనసాగిస్తామని అన్నారు. అంతకు ముందుకు ఆర్టీసీ టిమ్ డ్రైవర్ల పక్షాన ఆర్టీసీ డీఎం తిరుపతితో సుమారు గంటపాటు చర్చలు జరిపారు. ఆర్టీసీ డీఎం మొండి వైఖరి ప్రదర్శించడంతో చర్చలు విఫలమైనట్లు రవికుమార్ తెలిపారు. సీపీఐ నాయకులు మారెడ్డి శివాజీ, ఏపూరి వెంకటేశ్వరరావు, ఎస్వీఎస్ నాయుడు, మహేష్, శ్రీనివాస్ శోభన్, కొండబాబు పాల్గొన్నారు.

ఆత్మహత్యల నివారణ దినోత్సవం

చంద్రుగొండ: మండలకేంద్రం చంద్రుగొండలోని ప్రతిభ విద్యాలయంలో బుధవారం ప్రపంచ ఆత్మహత్యల వ్యతిరేక దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు, ఉపాధ్యాయులు ప్లకార్డులను ప్రదర్శించారు. విద్యాలయం ప్రిన్స్‌పాల్ ఎస్‌కె.పర్వీన్, ఉపాధ్యాయులు రమణ, ఎస్‌కె.షబాన, కీర్తి, అరుణ, ప్రియాంక, బషీర్ పాల్గొన్నారు.

పోస్టర్ల ఆవిష్కరణ

చంద్రుగొండ: ముస్లిం ఐక్యవేదిక మండల శాఖ ఆధ్వర్యంలో బుధవారం గోడపత్రికను ఆవిష్కరించారు. 'దైవప్రవక్త మహమ్మద్ సల్లెల్లాహు అలైహుసల్లం జీవిత సందేశం మానవాళికి..' అనే అంశంపై ఈ నెల 20న భద్రాచలంలోని భక్తరామదాసు కళాక్షేత్రంలో సదస్సు ఏర్పాటు చేసినట్లు నాయకులు తెలిపారు. ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొనాలని పిలుపునిచ్చారు. నాయకులు ఎండి.మాస్తాన్‌సాబ్, ఆసిఫ్‌పాష, ఎండి.అన్వర్, మౌలాలీ, ముర్తుజా, ఆబీద్, రషీద్ పాల్గొన్నారు.

పట్టుకున్నారు.. వదిలేశారు..

- ఇసుక ట్రాక్టర్లు పట్టుకున్న పోలీసులు
- అనుమతి ఉందన్న తహసీల్దార్
- పట్టుబడగానే కూపన్లు సృష్టించారా?



పోలీసులు పట్టుకున్న ఇసుక ట్రాక్టర్లు ఇవే..

అశ్వారావుపేట: అశ్వారావుపేట పోలీసులు బుధవారం ఐదు ట్రాక్టర్లను ఎలాంటి అనుమతులు లేకుండా ఇసుక రవాణా చేస్తున్నాయనే విశ్వసనీయ సమాచారంతో పట్టుకుని అశ్వారావుపేట పోలీస్ స్టేషన్‌కు తరలించారు. ఈ ట్రాక్టర్లను పరిశీలించి, అనుమతులు ఉన్నవా.. లేనివా తేల్చాలని తహసీల్దార్ రామకృష్ణను లిఖిత పూర్వకంగా కోరారు. అన్నింటికీ అనుమతులు ఉన్నాయని తహసీల్దార్ తేల్చి చెప్పేశారు. దీంతో తహసీల్దార్ వివరణ ప్రకారం అక్రమమో.. సక్రమమో అర్థం కాక పోలీసులు ఇసుక ట్రాక్టర్లను వదిలేశారు. అయితే, పట్టుబడిన ఐదింటిలో జమ్మిగూడెం గ్రామానికి చెందిన ఓ కూపన్ తేదీ.. జారీ తేదీలు వేర్వేరుగా ఉన్నాయి. ఇక్కడే కిటుకంతా దాగి ఉన్నట్లు తెలుస్తోంది.

ఇదీ సంగతి..

ఓ రెండు సంఘనలు పరిశీలిస్తే..ఈ మొత్తం వ్యవహారంలో ఏం జరుగుతోందో ఓ అంచనా వస్తుంది. ఈ నెల 8న కూపన్ నంబర్ 22/56తో అచ్యుతాపురం గ్రామానికి కుదుములపాడు వాగు నుంచి అధికారులు ఓ కూపన్ జారీ చేశారు. కానీ ఇందులో కూపన్ జారీ తేదీ ఈనెల 10గా ఉంది. అలాగే, ఈనెల 8న కూపన్ నంబరు 08/08తో సుజాత పేరుతో అశ్వారావుపేటకు ఓ కూపన్‌ను జారీ చేశారు. ఇందులో కూడా జారీ చేసిన తేదీ ఈనెల 10 ఉంది. అంటే సదరు వ్యక్తులు ఇసుక కావాలని కూపన్ జారీకి రెండ్రోజుల ముందే తహసీల్దార్‌ను ఆశ్రయించినట్లు అర్థం వస్తోంది. కానీ, అధికారికంగా ఏ రోజు కూపన్ ఆ రోజే జారీ కావాలి. ఇంకాస్త ముందుకెళ్లి పరిశీలిస్తే.. బుధవారం ట్రాక్టర్లు ఉదయం ఉదయం 10 గంటల సమయంలో పట్టుబడ్డాయి. అప్పటికీ తహశీల్దార్ కార్యాలయమే తెరుచుకోదు. అప్పటికే కూపన్ ఎలా జారీ అయినట్లు? ఒక వేళ 10 గంటలకే కూపన్ జారీ చేసిన.. ట్రాక్టర్ 25 కిలోమీటర్ల దూరంలోని నందిపాడు, కుదుముల పాడు వెళ్లడానికి గంట సమయం పడుతుంది (11గంటలు). వాగులోకి దిగి ఇసుక లోడ్ చేయడానికి సుమారు రెండు గంటలు (మధ్యాహ్నం 1గంట) పడుతుంది. తడిసిన ఇసుకతో నిండిన ట్రక్‌తో ట్రాక్టర్ వాగులో నుంచి గట్టు ఎక్కడానికి కనీసం మరో అరగంట (మధ్యాహ్నం 1.30 గంటలు) పడుతుంది. అప్పుడు కాని ట్రాక్టర్లు రోడ్డెక్కవు. కానీ విచిత్రంగా ఉదయం 10గంటల సమయంలోనే రోడ్ల మీద ట్రాక్టర్లు పోలీసులకు దొరికిపోయాయి. అంటే ఏ రోజు పట్టుబడితే ఆ రోజుకు జారీ తేదీలను మార్చుకుంటూ కూపన్లు చిత్రీకరిస్తున్నట్లు పలువురు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు.

రాజకీయ నాయకుల జోక్యం..

అశ్వారావుపేట ఇసుక, మట్టి మాఫియా రాజకీయ నాయకుల అండదండలతో తహసీల్దార్‌ను తప్పుదోవ పట్టిస్తునట్లు తెలుస్తోంది. స్వయంగా తహసీల్దార్ మండలంలో పర్యటిస్తున్నపుడు వరుసగా వస్తున్న ఇసుక, మట్టి ట్రాక్టర్లను తనిఖీ చేయగా.. ఎలాంటి అనుమతులు లేకుంటే సీజ్ చేసి కార్యాలయానికి తరలించాలని ఆదేశించారు. కానీ తహసీల్దార్ తన పని ముగించుకుని కార్యాలయానికి చేరుకునే సరికి ఒక్క ట్రాక్టర్ కూడా లేదు. ఈ సంఘటన ఈనెల 6న జరిగింది. ఓ తహసీల్దార్ పట్టుకున్న ట్రాక్టర్లు మాయం చేసేంత ధైర్యం నిత్యనేరస్తులైన ఇసుక, మట్టి మాఫియా చేయదు. రాజకీయ అండదండలుండటంతో సాక్షాత్తూ తహసీల్దార్ సైతం నిమ్మకుండి పోయినట్లు ప్రచారం జరుగుతోంది. బుధవారం పట్టుబడ్డ ట్రాక్టర్లు అక్రమం నుంచి సక్రమం అవడం వెనుక కూడా రాజకీయ ఒత్తిడిలే ఉండొచ్చనే ప్రచారం జరుగుతోంది.

ఓటర్ల తుది జాబితా విడుదల



అశ్వారావుపేటరూరల్: నోటీస్ బోర్డులో తుది జాబితాను ప్రదర్శిస్తున్న ఎంపీడీఓ అప్పారావు

అశ్వారావుపేటరూరల్: స్థానిక సంస్థల ఎన్నికలకు సంబంధించిన ఎంపీటీసీ, జెడ్పీటీసీ ఓటర్లు, పోలింగ్ కేంద్రాల తుది జాబితాను బుధవారం ఎంపీడీఓ అప్పారావు విడుదల చేశారు. ఆ జాబితాను స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలోని నోటీస్ బోర్డులో ప్రదర్శించారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ మాట్లాడుతూ.. మండలంలోని 27 గ్రామ పంచాయతీల పరిధిలో 30,699 మంది ఓటర్లు ఉండగా.. వీరిలో 14,927 మంది పురుషులు, 15,770 మంది మహిళలు, 2 ఇతరులు ఉన్నారని తెలిపారు. 60 పోలింగ్ కేంద్రాలను ఎంపిక చేసినట్లు వెల్లడించారు. సీనియర్ అసిస్టెంట్ మాలోతు కుమారి, సిబ్బంది శ్రీనివాసరావు ఉన్నారు.

చంద్రుగొండ: స్థానిక సంస్థల ఎన్నికల ఓటర్ల తుది జాబితాను అధికారులు బుధవారం విడుదల చేశారు. మండలంలోని మొత్తం 14 పంచాయతీల పరిధిలోని 8 ఎంపీటీసీ, ఒక జెడ్పీటీసీ స్థానానికి సంబంధించి తుది ఓటర్ల జాబితాను ఎంపీడీఓ బయ్యారపు అశోక్ విడుదల చేస్తున్నట్లు ప్రకటించారు. కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

జోనల్ స్థాయి క్రీడాపోటీలు ప్రారంభం

మణుగూరుటౌన్: మండలంలోని జెడ్పీ హైస్కూల్‌లో జోనల్ స్థాయి పాఠశాలల క్రీడా పోటీలను పినపాక ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు బుధవారం ప్రారంభించారు. క్రీడాకారులను పరిచయం చేసుకుని వాలీబాల్ ఆడారు. కార్యక్రమంలో మండల విద్యాధికారి స్వర్ణజ్యోతి, అశ్వాపురం ఎంఈఓ వీరస్వామి, హెచ్ఎం నాగశ్రీ, మండల కాంగ్రెస్ నాయకులు పి.నవీన్, శివసైదులు, సౌజన్య, రహీంపాషా, కూచిపూడి బాబు, మండల నాయకులు పాల్గొన్నారు.మరోవైపు, మండలంలోని 67 మంది లబ్ధిదారులకు ప్రజాభవన్‌లో రూ.67.7 లక్షల కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులను పంపిణీ చేశారు. తహసీల్దార్ నరేశ్, మండల నాయకులు పాల్గొన్నారు.



క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు

పాఠశాలకు బియ్యం అందజేత



బియ్యం అందజేస్తున్న అబ్దుల్ రవూఫ్ దంపతులు

మణుగూరురూరల్: మండలంలోని సంతోష్‌నగర్‌లో ఉన్న శ్రీవిద్యాభ్యాస (బాలవెలుగు) పాఠశాలకు సింగరేణి కార్మిక నాయకుడు అబ్దుల్ రవూఫ్-షాకీరా దంపతులు వారి వివాహ వార్షికోత్సవం సందర్భంగా బుధవారం క్వింటా బియ్యం వితరణగా అందజేశారు.

అనంతరం పాఠశాల విద్యార్థులకు పండ్లు, బిస్కెట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో అబ్దుల్ రవూఫ్ కుటుంబ సభ్యులు, బంధువులు ఆరీఫ్, తస్లీమ్-కౌసర్ దంపతులు, ఆసిఫ్-గౌసియా దంపతులు, నజీర్, ముబీన్, ఫరూక్, పాఠశాల నిర్వాహకులు జగన్మోహన్‌రెడ్డి, ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.

సీతారాం ఏచూరి ఆశయాలను కొనసాగిద్దాం

చర్ల: దోపిడీ పాలనకు వ్యతిరేకంగా ఉద్యమాలు కొనసాగించిన సీపీఎం జాతీయ నేత, మాజీ ఎంపీ, సీతారం ఏచూరి ఆశయాలను కొనసాగిద్దామని ఆ పార్టీ మండల కార్యదర్శి మచ్చా రామారావు పిలుపునిచ్చారు. బుధవారం మండలంలోని పూసుగుప్పలో సీతారం ఏచూరి వర్థంతిని నిర్వహించారు. ఈ సందర్భంగా మచ్చా రామారావు మాట్లాడారు. కార్యక్రమంలో నాయకులు గుండి చిన్నబ్బి, ఉయికా రమేష్, ఉయికా రామకృష్ణ, జగపతి, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

దుమ్ముగూడెం: మార్క్సిస్టు మేధావి, సీపీఎం అఖిల భారత మాజీ కార్యదర్శి సీతారాం ఏచూరి, సాయుధ పోరాట నిప్పురవ్వ చాకలి ఐలమ్మ స్ఫూర్తితో పోరాటాలను మరింత ఉధృతం చేస్తామని సీపీఎం మండల కార్యదర్శి కారం పుల్లయ్య పిలుపునిచ్చారు. బుధవారం దుమ్ముగూడెం గ్రామంలో సీతారాం ఏచూరి, చాకలి ఐలమ్మ వర్థంతి సభ నిర్వహించారు. కారం పుల్లయ్య మాట్లాడుతూ.. ఏచూరి, ఐలమ్మల విప్లవ పంథాను వివరించారు. పార్టీ జిల్లా కమిటీ సభ్యుడు యలమంచి వంశీకృష్ణ, మర్మం చంద్రయ్య, కొరస చిలకమ్మ, నాయకులు యలమంచి శ్రీనుబాబు, బొల్లి సత్యనారాయణ, కొమరం చంటి, బైరెడ్డి సతీష్, బత్రి నరసింహారావు, మొసలి రాంబాబు, నరసింహారావు, చుక్క గణేష్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

రహదారి మరమ్మతుకు ఆందోళన



చర్లలో నిరసన ర్యాలీ నిర్వహిస్తున్న బీఆర్ఎస్ నాయకులు

చర్ల: భద్రాచలం-వెంకటాపురం ప్రధాన రహదారికి వెంటనే మరమ్మతులు చేయించాలని డిమాండ్ చేస్తూ బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో బుధవారం ఆందోళన నిర్వహించారు. మండలంలోని రాళ్లగూడెం నుంచి చర్ల వరకు మోటార్ బైక్ ర్యాలీ నిర్వహించి ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. అనంతరం తహసీల్దార్ కార్యాలయంలో డిప్యూటీ తహసీల్దార్ ముద్దరాజుకు వినతిపత్రాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో పార్టీ మండల కన్వీనర్ దొడ్డి తాతారావు, నాయకులు ఎస్‌డీ అజీజ్, సాదిక్, అనీల్, బుద్దరాజు, తెల్లం లక్ష్మీనారాయణ, తడికల బుల్లెబ్బాయి, వెంకటేశ్వరావు, మామిడి రాజు, రాము, సాయి, రామదాసు, కొమరయ్య, కృష్ణ, సుధాకర్, సోమరాజు, సాంబ తదితరులు పాల్గొన్నారు.

17న ఉద్యోగ మేళా

దుమ్ముగూడెం: 2024-25 సంవత్సరంలో ఇంటర్మీడియట్ ఉత్తీర్ణులైన విద్యార్థులు ఈ నెల 17వ తేదీన కొత్తగూడెం ప్రభుత్వ జూనియర్ కళాశాలలో నిర్వహించే ఉద్యోగమేళాను సద్వినియోగం చేసుకోవాలని దుమ్ముగూడెం ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ సీహెచ్.కృష్ణవేణి బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. హెచ్‌సీఎల్ టెక్ బీ ఆధ్వర్యంలో నిర్వహించే ఉద్యోగమేళాలో ఎంపీసీ, ఎంఈసీ, బైపీసీ, సీఈసీ, హెచ్ఈసీ, ఒకేషనల్ గ్రూపుల్లో 2024-25 సంవత్సరంలో 75శాతం మార్కులతో ఇంటర్మీడియట్ పూర్తి చేసుకున్న ప్రభుత్వ, ప్రైవేట్ విద్యార్థులు మేళాలో పాల్గొనవచ్చని తెలిపారు. తమ పది, ఇంటర్ పాస్ సర్టిఫికెట్ల జిరాక్స్, ఆధార్ కార్డు జిరాక్స్, ఒక ఫొటో, ఆండ్రాయిడ్ మొబైల్‌తో హాజరు కావాలని, మరింత సమాచారం కోసం హెచ్‌సీఎల్ ప్రతినిధి నంబర్లు 8341405102, 7981834205లను సంప్రదించాలని సూచించారు.

విడతల వారీ యూరియా వాడకమే మేలు

గుండాల: రైతులు తీసుకున్న యూరియా ఒకేసారి కాకుండా ఎకరానికి 15 కేజీల చొప్పున 15 రోజులకు ఒకసారి పిచికారీ చేయాలని ఏడీఏ తాతారావు సూచించారు. మండలంలోని కాచనపల్లి రైతువేదిక వద్ద బుధవారం యూరియా కౌంటర్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మండలంలో సాయనపల్లి, ముత్తాపురం, మామకన్ను, శంభునిగూడెం గ్రామాల్లో ప్రత్యేక కౌంటర్లు ఏర్పాటుకు ప్రయత్నాలు జరుగుతున్నట్లు తెలిపారు. ఏఓ వెంకట రమణ, ఏఈఓ లెనిల్, బాలరాజు, కార్యదర్శి మల్లేష్ పాల్గొన్నారు.

మృతుల కుటుంబాలను ఆదుకోవాలి

చర్ల: ఉంజుపల్లిలో నిర్మాణంలో ఉన్న మిషన్ భగీరథ వాటర్ ట్యాంకులో దిగి ఊపిరి ఆడక మృతి చెందిన ముగ్గురి కుటుంబాలను ప్రభుత్వం ఆదుకోవాలని బీఎస్పీ భద్రాచలం నియోజకవర్గ ఇన్‌చార్జ్ గుర్రాల దుర్గాభవాని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బుధవారం చర్లలోని బీఎస్పీ కార్యాలయంలో జరిగిన పార్టీ ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆమె మాట్లాడారు. సమావేశంలో పార్టీ మండల అధ్యక్షుడు కొండా కౌశిక్, ఉపాధ్యక్షుడు చెన్నం మహేష్, నాయకులు బాషా, గుర్రాల విజయ్, చెన్నం పవన్, చంద్రమ్మ, నక్కా సాంబయ్య తదితరులు పాల్గొన్నారు.

మావో వర్ధంతి సభ

చంద్రుగొండ: మావో ఆలోచనలను ముందుకు తీసుకెళ్దామని సీపీఐ (ఎంఎల్) న్యూడెమోక్రసీ జిల్లా నాయకులు ఎస్‌కె.ఉమర్ పిలుపునిచ్చారు. మండలంలోని కరిశెలబోడుతండాలో బుధవారం మావో వర్ధంతి సభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఉమర్ మాట్లాడారు. కార్యక్రమంలో ఆ పార్టీ నాయకులు మూడు నందా, ధారావత్ బాలు, లింగరాములు, రాందాస్, బేలియా, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

బీఆర్ఎస్ మాటలు హాస్యాస్పదం

దుమ్ముగూడెం: మిషన్ భగీరథ పథకాన్ని కాంగ్రెస్ ప్రభుత్వం నిర్వీర్యం చేస్తుందన్న బీఆర్ఎస్ నాయకులు మాటలు హాస్యస్పదమని కాంగ్రెస్ మండల నాయకుడు లంకా శ్రీనివాసరావు అన్నారు. బుధవారం ఎమ్మెల్యే క్యాంప్ ఆఫీస్‌లో కాంగ్రెస్ పార్టీ ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గత ప్రభుత్వంలో మండలంలో మారుమూల ప్రాంతాలకు మిషన్ భగీరథ నీళ్ల అందించలేకపోగా.. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాక ఎమ్మెల్యే వెంకట్రావు మారుమూల గిరిజన గ్రామాలకు మిషన్ భగీరథ నీరు అందించేందుకు నిధులు కేటాయించారని తెలిపారు. భద్రాచలం వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ తెల్లం సీతమ్మ, కాంగ్రెస్ మండల నాయకుడు సత్యనారాయణమూర్తి, శ్రీనివాసరావు, సీతారామరావు, సుబ్బారావు, చంటి, కామరాజు, శీను, వెంకటేశ్వరరావు, చందు, చిన్నారావు, నాగేంద్ర పాల్గొన్నారు.

13న జాతీయ లోక్ అదాలత్



సమావేశంలో మాట్లాడుతున్న మెజిస్ట్రేట్ సూరిరెడ్డి

మణుగూరురూరల్: ఈ నెల 13వ తేదీన మణుగూరు ఫస్ట్ క్లాస్ జ్యుడిషియల్ కోర్టులో నిర్వహించే జాతీయ లోక్ అదాలత్‌ను సద్వినియోగం చేసుకోవాలని మెజిస్ట్రేట్ కె.సూరిరెడ్డి తెలిపారు. బుధవారం కోర్టులో ఆయన న్యాయవాదులతో సమావేశం నిర్వహించి లోక్ అదాలత్, పెండింగ్ కేసుల గురించి చర్చించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. ఎన్నో ఏళ్లుగా పెండింగ్‌లో ఉన్న కేసులు, రాజీ పడదగిన కేసులు ఉంటే వచ్చి ఇరువర్గాల వారు రాజీ కుదుర్చుకోవాలని సూచించారు. అలాగే డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులు ఉన్న వారు సైతం కోర్టుకు వచ్చి తక్కువ చలానాలు కట్టుకోవాలని సూచించారు. అనంతరం బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మెజిస్ట్రేట్ న్యాయవాదులకు హెల్త్ కార్డులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షుడు బద్దం శ్రీనివాస్‌రెడ్డి, మండల లీగల్ కౌన్సిల్ సభ్యుడు అంకం సర్వేశ్వరరావు, న్యాయవాదులు కందిమళ్ల నర్సింహారావు, గురుకృష్ణ, రామ్మోహన్‌రావు, సరస్వతి, పానుగోటి కిషన్‌రావు, శ్రీనివాసరావు, అన్వేష్, ప్రభురాజ్, రాము, సాంబ,వాసవి, రమేష్, కోర్టు సిబ్బంది పాల్గొన్నారు.

గ్రామస్థాయి మ్యాపింగ్ ప్రాముఖ్యం



దుమ్ముగూడెం: మాట్లాడుతున్న ఎంపీడీఓ వివేక్‌రామ్

దుమ్ముగూడెం: ఆది కర్మయోగి కార్యక్రమంలో గ్రామస్థాయి మ్యాపింగ్ అత్యంత ముఖ్యమని ఎంపీడీఓ వివేక్ రామ్ అన్నారు. బుధవారం మండల అభివృద్ధి సమావేశ మందిరంలో ఏర్పాటు చేసిన రెండు రోజుల శిక్షణ కార్యక్రమాలను ఆయన పర్యవేక్షించి సూచనలు చేశారు. గ్రామాన్ని మ్యాపింగ్ చేయటం, సామాజిక లక్షణాలను గుర్తించడం, స్థానిక పరిజ్ఞానాన్ని పొందుపరచటం చర్చించడం తదితర అంశాలపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. ఇక్కడ తీసుకున్న శిక్షణను గ్రామస్థాయిలో సమస్యలపై కేంద్రీకరించి ఆశించిన లక్ష్యాలను సాధించాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఏపీఓ జగదీష్, రిసోర్స్ పర్సన్లు బెక్కంటి శ్రీనివాసరావు, పి.విజయవర్ధన్, సహన సుల్తానా, వెంకట నర్సమ్మ తదితరులు పాల్గొన్నారు.

అశ్వారావుపేటరూరల్: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని ఎంపీడీఓ అప్పారావు అన్నారు. బుధవారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో జాతీయ స్థాయి ఆదికర్మ యోగి అభియాన్ కార్యక్రమంపై గ్రామస్థాయి అధికారులకు శిక్షణ ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ మాట్లాడుతూ.. ప్రభుత్వాలు అమలు చేస్తున్న పథకాలపై గ్రామస్థాయిలో అవగాహన కల్పించాలని, వారికి పథకాల ప్రయోజనాలను అందే విధంగా కృషి చేయాలని అన్నారు. సమావేశంలో జిల్లా మాస్టర్ ట్రైనర్ ఎస్‌డి.సలీం, అబ్జర్వర్, ఐటీడీఏ డీఈ బాపనయ్య, బ్లాక్ లెవల్ ట్రైనర్ సౌజన్య, డీపీఎంఓ మోహన్ పాల్గొన్నారు.

రాళ్లాపురంలో వైద్యశిబిరం

చర్ల: మండలంలోని మారుమూల మలేరియా ప్రభావిత గ్రామమైన రాళ్లాపురంలో బుధవారం వైద్యశిబిరాన్ని నిర్వహించారు. వైద్యశిబిరంలో డాక్టర్ పూజిత 36 మంది ఆదివాసీలకు వైద్య పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారికి పరిశుభ్రత, ఆరోగ్య పరిరక్షణపై పలు సూచనలు చేశారు. శిబిరంలో హెల్త్ సూపర్‌వైజర్ రాంప్రసాద్, మిడ్ లెవల్ హెల్త్ ప్రొవైడర్ తులసి, హెల్త్ అస్టెంట్ స్వరూప పాల్గొన్నారు.

బకచింతలపాడులో..

దుమ్ముగూడెం: మండలంలోని పర్ణశాల పీహెచ్‌సీ పరిధిలోని గొత్తికోయ గ్రామం బకచింతలపాడులో డాక్టర్ రేణుక రెడ్డి ఆధ్వర్యంలో బుధవారం హెల్త్ క్యాంప్ నిర్వహించారు. గర్భిణులు, బాలింతలతో పాటు జ్వరంతో ఉన్నవారికి రక్త పరీక్షలు చేసి మందులు అందజేశారు. అలాగే గ్రామంలో రాపిడ్ ఫీవర్ సర్వేలో భాగంగా ఇంటింటా సర్వే చేసి, యాంటీ లార్వా ఆపరేషన్ చేశారు. గ్రామస్తులకు పరిసరాలు, వ్యక్తిగత పరిశుభ్రత గురించి అవగాహన కల్పించారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది అమ్మాజీ, నాగేశ్వరరావు, నర్సమ్మ, ఆశా వర్కర్లు తదితరులు పాల్గొన్నారు.

సత్తాచాటిన 'చిరుమళ్ల' విద్యార్థులు



జిల్లా స్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థులతో ఉపాధ్యాయులు

కరకగూడెం: పినపాక మండలంలోని ఏడుల్లా బయ్యారం జెడ్పీ పాఠశాలలో ఇటీవల నిర్వహించిన పినపాక-కరకగూడెం మండలాల జోనల్ స్థాయి క్రీడా పోటీల్లో చిరుమళ్ల ఆశ్రమ పాఠశాల విద్యార్థులు అద్భుత ప్రతిభ కనబరిచినట్లు హెడ్ మాస్టర్ రామచంద్రరావు తెలిపారు. బుధవారం ఆయన పాఠశాలలో వాలీబాల్, ఖోఖో, కబడ్డీ, అథ్లెటిక్స్ విభాగాల్లో రాణించి జిల్లా స్థాయికి ఎంపికైన పలువురు విద్యార్థులను అభినందించి ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. వారిని అభినందించారు. కార్యక్రమంలో పీడీ బాలరాజు, వార్డెన్ రవీందర్, ఉపాధ్యాయులు గంగరాజు, జనార్దన్, రాజు తదితరులు పాల్గొన్నారు.

ఐలమ్మ స్ఫూర్తితో పోరాడాలి

తెలంగాణ సాయుధ పోరాట యోధురాలు, వీరనారి చాకలి ఐలమ్మ వర్ధంతిని పురస్కరించుకుని ప్రభుత్వ కార్యాలయాలు, పార్టీల ఆధ్వర్యంలో పలు చోట్ల కార్యక్రమాలు ఏర్పాటు చేశారు. ఆమె చిత్రపటాలకు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ.. ఐలమ్మ స్ఫూర్తితో పోరాటాలకు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు.

– సాక్షి నెట్‌వర్క్



బూర్గంపాడు: నాగినేనిప్రోలులో ఐలమ్మ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న మహిళలు



దమ్మపేట: చాకలి ఐలమ్మ చిత్రపటం వద్ద ఎమ్మెల్యే జారే, కాంగ్రెస్ నాయకుల నివాళి..



అశ్వారావుపేటరూరల్: ఐలమ్మ చిత్రపటానికి పూలమాల వేస్తున్న మున్సిపాలిటీ సిబ్బంది



ములకలపల్లి: నివాళులర్పిస్తున్న సీపీఎం నాయకులు రాంబాబు, తదితరులు